గోకులం..లేదు ప్రతిఫలం!

● నిధుల కోసం నిరీక్షణ

కురిచేడు:

పశువులు పెంచుకునే పశుపోషకులకు ప్రభుత్వం గోకులాలను మంజూరు చేసింది. కానీ వాటికి నిధులు విడుదలను మరిచింది. గోకులాలు నిర్మించుకున్న లబ్ధిదారులు నిత్యం ఖాతా పుస్తకాలు తీసుకుని బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఖాతాల్లో నిధులు జమకాక పోవడంతో నిర్మించిన గోకులాలతో అప్పులపాలవుతున్నారు. మండలంలో 33 గోకులాలు మంజూరు కాగా వాటిల్లో 10 పూర్తయ్యాయి. 19 వివిధ దశల్లో ఉన్నాయి. 4 ఇంత వరకు ప్రారంభం కాలేదు. దర్శి నియోజకవర్గంలోని దర్శి మండలంలో 31లో పూర్తయినవి 25, వివిధ దశల్లో ఉన్నవి 6, దొనకొండ మండలంలో 26లో 12 పూర్తికాగా వివిధ దశల్లో ఉన్నవి 14, ముండ్లమూరు మండలంలో 32కు గాను 18 పూర్తికాగా వివిధ దశల్లో ఉన్నవి 14, తాళ్లూరు మండలంలో 23కు గాను 8 పూర్తికాగా 15 వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలోని 38 మండలాల్లో 1048 గోకులాలు మంజూరు కాగా 510 పూర్తయ్యాయి. 538 వివిధ దశల్లో ఉన్నాయి. రాష్ట్రంలోని 658 మండలాల్లో 22,690 గోకులాల్లో 11,252 పూర్తికాగా 11,438 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కో గోకులానికి రూ.2.30 లక్షలు మంజూరుకాగా వాటిల్లో 10 పది శాతం అంటే రూ.23 వేలు లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంది. మిగిలిన రూ.2.70 లక్షలు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సి ఉంది. గోకులాలు ప్రారంభించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిధులున్నాయి, నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే నిధులు చెల్లిస్తామని, పంటలకు పెట్టుబడుల సమయంలో కూడా ఒత్తిడి చేసి నిర్మాణాలు పూర్తి చేయించారు. కానీ అదే ఒత్తిడితో బిల్లులు మాత్రం చెల్లించడం లేదని గోకులం లబ్ధిదారులు వాపోతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్రం ప్రభుత్వం ఆధీనం కావడంతో వెంటనే నిధులు ఇస్తారనే ఆశతో నిర్మాణాలు చేపట్టామని, అయినా ఇంత వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను బిల్లుల గురించి అడిగితే ప్రభుత్వం నుంచి రాగానే చెల్లిస్తామని చెబుతున్నారని, ఎప్పుడు వచ్చేది చెప్పడం లేదని, అప్పులు తెచ్చిన దగ్గర వడ్డీలు పెరుగుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే గోకులాల బిల్లులు చెల్లించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


కురిచేడులో నిర్మాణంలో ఉన్న గోకులం


పడమర నాయుడుపాలెంలో ప్రారంభమైన గోకులం

క్లుప్తంగా

రేపటి నుంచి గ్రామాల్లో ఉపాధి పనుల తనిఖీ

పుల్లలచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను ఆదివారం నుంచి తనిఖీ చేయనున్నట్లు ఎస్ఆర్‌పీ మూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 19 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి–మార్చి 2024 వరకు జరిగిన 1251 పనులకు సంబంధించి దాదాపు 22 కోట్ల 83 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఆ పనులన్నీ సక్రమంగా జరిగాయా, ప్రభుత్వ నిబంధనల మేరకు జరిగాయా లేదా అని తమ సిబ్బంది ప్రతి ఒక్కటీ పరిశీలించి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీ జరిగేటప్పుడు ప్రజలు సహకరించాలని కోరారు. తనిఖీ నివేదిక అందిన తర్వాత అధికారుల ఆదేశాలపై ప్రజా సదస్సు నిర్వహించనున్నట్లు మూర్తి స్పష్టం చేశారు.

జెడ్పీ హైస్కూల్లో సామాజిక బృందం తనిఖీ

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం వివిధ అంశాలను పరిశీలించింది. ఎం.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ ఆధ్వర్యంలోని బృందం మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ, సమగ్రశిక్ష ద్వారా అందుతున్న వివిధ రకాల వనరుల వినియోగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, క్రీడలు తదితర అంశాలను తనిఖీ చేసినట్లు హెచ్ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించినట్లు చెప్పారు. ఎంఈఓ 2 కె.శర్వాణి, స్టేట్ రిసోర్స్ పర్సన్ టి.వెంకటేశ్వరరావు, జిల్లా రిసోర్సుపర్సన్ జి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి

గిద్దలూరు రూరల్: బాల్యవివాహాలు నివారించాలని సీడీపీఓ బి.జ్యోతి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, లింగ వివక్షపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, ఉషారాణి, సచివాలయం మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తాం

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షునిగా నియమితులైన నుసుం బాలచంద్రుడు, బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన నల్లబోతుల కొండయ్య, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన చదలవాడ రమణారెడ్డి పేర్కొన్నారు. తమకు పదవులు రావడంతో సహకరించిన వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాచర్ల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుకు సాగవచ్చన్నారు. ఏఎస్సై ఆదిశేషయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.మేరికుమారి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల శ్రమదానం

మార్కాపురం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం పూర్వ విద్యార్థులు శ్రమదానం చేశారు. 1986–87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. తాము చదువుకున్న పాఠశాలలో శ్రమదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. వీరిని హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు డాక్టర్ బాషా, గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము, తన్నీరు వెంకటరమణ, పీవీ కృష్ణారావు, అనుముల రామాంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి


దొనకొండ: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మమత


దర్శి: మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

కురిచేడు: బాల్య వివాహాలను నిరోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.నాగమణి కోరారు. జాతీయ బాలికాదినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీఎస్, ఎంపీపీ ఉర్దూ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల డ్రాపౌట్ తగ్గించాలని సూచించారు. బాలికలకు అన్ని ప్రదేశాల్లో రక్షణగా ఎలా ఉండాలో వివరించారు. బాలికల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల గురించి వివరించారు. బాలికల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని వివరించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీ రామసుబ్బులు, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ ఫాతిమా, ఎస్.ప్రభావతి, జె.పార్వతి పాల్గొన్నారు.

దర్శి: నియోజకవర్గంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బాలికల ప్రగతి గురించి వారికి రాజ్యాంగం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు, వసతులు, అవకాశాల గురించి, సమాజంలో వారి పాత్ర గురించి వివరించారు. విద్యార్థులు భవిషత్‌లో అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంచి పెట్టారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు బసంతి, ఖాశీం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం తూర్పు వెంకటాపురం హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ భారతి మాట్లాడుతూ కిశోర బాలికలకు బాలల హక్కుల గురించి వివరించారు. విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. సూపర్‌వైజర్ కె.అనూరాధ, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ ఆర్.ఆనందలత పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని స్థానిక కేజీబీవీలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో పి.ఆంజనేయులు, ప్రత్యేకాధికారి తిరుమల దేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ బహుమతులు అందజేశారు.

దొనకొండ: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఎం.శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు నిషేధించాలని, చిన్న వయసులో బాలికలకు వివాహాలు చేస్తే అనేక నష్టాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే తెలియజేయాలని ఎంపీడీఓ తెలిపారు. ప్రత్యేకాధికారి మమత మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవాలని, మహిళలే ఎక్కువ మంది చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారని ఆమె గుర్తు చేశారు. ఆడ పిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదాలతో ర్యాలీ చేశారు. ప్రత్యేకాధికారి మమత, ఏఎన్ఎం లీలాబాయి, మహిళా పోలీస్ శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు జయమణి, నరసమ్మ, ఝాన్సీరాణి, లలిత, లీలాకుమారి, నిర్మల, నసిమా సుల్తానా, నాగేంద్రమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లూరు: స్థానిక కస్తూరిబా పాఠశాల, వీకేజీహెచ్ స్కూల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు, మగ పిల్లలని వ్యత్యాసం లేకుండా ఇద్దరూ సమానమేనన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మంచిగా చదువుకోవాలని సూచించారు. ఎంఈఓ సుబ్బయ్య మాట్లాడుతూ ఆడపిల్లలు భావితరాలకు పునాదిరాళ్లని, దేశ భవిష్యత్తు వారిపై ఆధారపడి ఉందన్నారు. తల్లిదండ్రులకు, చదువు నేర్పించిన గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కస్తూరిబా ప్రిన్సిపాల్ సుజాత, ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, రాజ్యలక్ష్మి, కస్తూరిబా స్కూల్ టీచర్స్, హైస్కూల్ టీచర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): బాల్యవివాహాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు వెంకటేశ్వర రెడ్డి సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా, బాలికల చట్టాలు, ఆత్మహత్యల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఆవుల సునీత, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఎంఎస్‌కే శాంతి ప్రియ, ఏఎస్ఎం ప్రభావతి పాల్గొన్నారు.


కురిచేడు: బాలికా దినోత్సవంలో సూపర్‌వైజర్, సిబ్బంది


మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి


యర్రగొండపాలెం: మొక్కలు నాటుతున్న విద్యార్థినులు


తాళ్లూరు: మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బయ్య


ఎమ్మెల్యే తాటిపర్తిని సత్కరిస్తున్న దొండేటి నాగేశ్వరరెడ్డి

ఎమ్మెల్యే తాటిపర్తికి సత్కారం

పెద్దదోర్నాల: యర్రగొండపాలెం నియోజకవర్గ శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్‌ను వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసిన దొండేటి నాగేశ్వరరెడ్డి తనను ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆయన ఘనంగా ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఐటీ విభాగం నాయకులు అంబటి జయసింహారెడ్డి, అల్లు సదాశివారెడ్డి, అల్లు నరేంద్రరెడ్డి, గాలి యోగీశ్వరరెడ్డి, వెన్నా కాశీశ్వరరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన

త్రిపురాంతకం: రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివబసవరాజు సూచించారు. శుక్రవారం మండలంలోని మేడపి సమీపంలో టోల్‌గేట్ వద్ద వాహనదారులతో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ఆటో డ్రైవర్లు రోడ్డుపై ప్రయాణించే సమయంలో నియమ నిబంధనలు పాటించాలన్నారు. జాతీయ రహదారిపై వాహనదారులు అతి వేగంగా ప్రయాణించకుండా నిదానంగా తగిన వేగంతో వెళ్తే ప్రమాదాలు జరగకుండా క్షేమంగా ఇంటికి వెళ్తారని చెప్పారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.


రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివబసవరాజు

దొనకొండలో త్యాగరాజు స్వామి ఉత్సవం


త్యాగరాజు ఉత్సవంలో నాయీ బ్రాహ్మణులు

దొనకొండ: శ్రీ వీరబ్రహ్మేంద్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు బొమ్మలాపురం వెంకటయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ త్యాగరాజు స్వామి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు. బ్రహ్మారావుపేట రామాలయం నుంచి పుర వీధుల్లో, రైల్వే స్టేషన్, వైఎస్సార్, ఎన్‌టీఆర్ విగ్రహాల దగ్గర ఊరేగింపుగా ఉత్సవాలు చేశారు. త్యాగరాజు పటాన్ని ఏర్పాటు చేసుకుని భజంత్రీలతో మేళతాళాలతో పాటలు పాడుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యడమకంటి మస్తానయ్య, కార్యదర్శి గుడిపాటి నాసరయ్య, పలు గ్రామాల నుంచి నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

పరిమితికి మించి వాహనాల్లో ఎక్కొద్దు

దర్శి: పరిమితికి మించి వాహనాల్లో ఎక్కొద్దని ఎంవీఐ రవికుమార్ సూచించారు. పట్టణంలోని ఆటోల్లో ప్రయాణాలు చేస్తున్న ప్రయాణికులకు ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ఎక్కితే ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాద శాతం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. డ్రైవర్‌కు ఇరువైపులా ఎవరూ ఎక్కరాదన్నారు. అలా ఎక్కినప్పుడు డ్రైవింగ్‌కు అసౌకర్యంగా ఉండి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. మద్యం తాగిన డ్రైవర్ల ఆటోలు ఎక్కొద్దని చెప్పారు. మద్యం తాగి వాహనాలు తోలినట్లు తెలిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి అధిక లోడ్‌తో వాహనాలు నడిపితే వాహనాలు మరమ్మతులకు గురవుతాయని, వాహనాలు కంట్రోల్ కాక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ మధ్య కాలంలో అలాంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. వాహనాలు నడిపే వారు కూడా ఇంటి వద్ద తమ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. మోటారు సైకిల్ నడిపే వారికి హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్ట్ తప్పని సరిగా ఉండాలన్నారు. ఎంవీఐ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


ఆటోల్లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రవికుమార్

ప్రయాణికుల భద్రతే ముఖ్యం

మార్కాపురం: ప్రయాణికుల భద్రతే ముఖ్యంగా బస్సులు నడపాలని ఆర్టీసీ డ్రైవర్లకు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు సూచించారు. శుక్రవారం డిపో గేట్ వద్ద నిర్వహించిన సమావేశంలో డీఎం మాట్లాడుతూ నైట్ సర్వీసుకు వెళ్లే డ్రైవర్లు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, అలసటగా ఉన్నా, అనారోగ్యంగా ఉన్నా బస్సులు నడపవద్దని చెప్పారు. ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీసీపై ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెడుతూ విధులు నిర్వర్తించాలని సూచించారు. సంస్థకు ఆదాయం తేవడం, ఇంధన పొదుపు పాటిస్తూ ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు.


మాట్లాడుతున్న డిపో మేనేజర్ నరసింహులు

పట్టుదల ఉంటే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

పెద్దదోర్నాల: లక్ష్య సాధనకు పట్టుదల తోడైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కేడీజే బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మోటివేషన్ క్లాసు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషన్ స్పీకర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. విద్యార్థులు చదువులో అన్ని వేళలా ముందడుగు వేయాలన్నారు. నిరంతరం వెలిగే సూర్యుడిని చూసి చీకటే భయపడుతుందన్నారు. ఈ సందర్భంగా బాబు ప్రసంగానికి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ సావిత్రి మాట్లాడుతూ సుమారు 45 ఏళ్ల క్రితం మండల కేంద్రంలోని విద్యార్థులకు ఓనమాలు నేర్పిన గురువు బాబు.. అని కొనియాడారు. ఆర్మీలో 17 సంవత్సరాలు విధులు నిర్వహించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా 23 సంవత్సరాలపాటు విధులు నిర్వహించారన్నారు. దీంతో పాటు రెండేళ్లలో 11 రాష్ట్రాల్లో 90 మోటివేషనల్ క్లాసులు నిర్వహించి అందరి మన్ననలు పొందారన్నారు. అధ్యాపకులు బాబును ఘనంగా సత్కరించారు.


బాబును సత్కరిస్తున్న అధ్యాపకులు

విద్యతోనే మహిళల అభ్యున్నతి



కొనకనమిట్లలో వలంటీర్లకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఈఓపీఆర్డీ

కొనకనమిట్ల: సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందని ఈఓపీఆర్డీ శ్రీదేవి, ఏపీఎం సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన విద్యా వలంటీర్లకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల మహిళా సమాఖ్యసభ్యులు,విద్యావలంటీర్లు పాల్గొన్నారు.